



సూచనలు చేస్తున్న అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు

వెలుగునీడ@2024

టీడీపీ అంటేనే బీసీల పార్టీ. 1983లో దివంగత ఎన్టీఆర్ పార్టీ స్థాపించిన తరువాత ఎందరో బీసీలు చట్టసభల్లో అడుగుపెట్టారు. కేంద్ర, రాష్ట్రమంత్రులయ్యారు. అది... టీడీపీకి బీసీలపై ఉన్న ప్రేమ. అయితే జగన్ సర్కారు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంది. నిధులు, విధులు లేని పదవులు ఇచ్చేసి బీసీల సంక్షేమం కోసం పాటుపడ్డామని చంకలు గుద్దుకుంది. బీసీలు ఇతర వర్గాల కోసం చంద్రబాబు హయాంలో అమలు చేసిన స్వయం ఉపాధి రుణాలనే అటకెక్కించింది. బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్లను కులాల వారీగా విడగొట్టి చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టరు పదవులు ఇచ్చేసి కనీసం కూర్చునేందుకు కుర్చీలు లేకుండా జగన్ సర్కారు చేసింది. పొద్దస్తమానం కష్టపడే కూలీల కోసం రూ.5కే భోజనం, రెక్కాడితే కానీ డొక్కాడని పేదల కోసం ఇచ్చిన పథకాలన్నీ రద్దు చేశారు. కేవలం నవరత్నాల పేరిట ఎన్నో నిబంధనలు పెట్టి తాత్కాలిక ప్రయోజనాలు అందించారు. అయితే ఇవన్నీ తొలి ఆరు నెలలు..



- సంక్షేమం అదుర్స్
- ఒకవైపు అభివృద్ధి.. మరోవైపు సంక్షేమం
- పేదల కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు
- ఉచితంగా గ్యాస్ సిలిండర్లు
- బీసీల కోసం మరోసారి స్వయం ఉపాధి రుణాలు
- 50 శాతం సబ్సిడీతో రుణాలు
- రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్
- కూటమి సర్కారుతో మళ్లీ బీసీలకు పూర్వవైభవం

రౌండప్ 2024

(కడప-ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జూన్ 12న అధికారంలోకి రావడంతో మళ్లీ బీసీలు, మహిళలకు పూర్వ వైభవం వచ్చింది. తమ సొంత కాళ్లపై నిలబడే శక్తిని చంద్రబాబు సర్కారు ఇచ్చింది. ఎన్నో సబ్సిడీ రుణాలు అందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. కాగా జగన్ హయాంలో తొలి ఆరునెలలు నవరత్నాలు తప్ప జనానికి శాశ్వత పరిష్కారం ఏమీ చూపలేదు. బీసీ కుటుంబాలకు బటన్ నొక్కుడు ద్వారా పదో పరకో ఇచ్చేసి చేయి తుడుచుకుని అదే పెద్ద భాగ్యమన్నట్లుగా కటింగ్ ఇచ్చారు. ఆయన పెంచిన కరెంటుచార్జీలు, చెత్త పన్ను, ఇతర చార్జీలకు సరిపోదు. బీసీలు, మహిళలు, రైతుల కోసం ఎలాంటి పథకాలు ఇవ్వలేదు. అన్నింటినీ నవరత్నాల్లో కలిపేసి చేతులు దులుపుకున్నారు.

టీడీపీ హయాంలో

సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఆరు నెలలు దాటింది. అయితే ఈ తక్కువ కాలంలోనే ప్రభుత్వం అటు అభివృద్ధి, ఇటు సంక్షేమం అన్ని సమపాళ్లలో నడిపిస్తుంది. జగన్ హయాంలో అభివృద్ధి పడకేసింది. అక్కడ పల్లెలో ఎలాంటి అభివృద్ధి లేదు. వర్షం వస్తే రోడ్లన్నీ మురికి బురదగా మారేవి. ఇక ఆర్అండ్‌బీ రోడ్డు పరిస్థితి మరీ దారుణం. జిల్లాలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆర్అండ్‌బీ, గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తోంది.

బీసీల కోసం

జగన్ హయాంలో అణగారిన వర్గాలకు లబ్ధి జరిగింది శూన్యం. టీడీపీ హయాంలో బీసీలకు సబ్సిడీ రుణాలు ఇచ్చేవారు. ప్రభుత్వ సొమ్ముతో ఆ వర్గాలు ఆర్థికంగా స్థిరపరిచేందుకు చంద్రబాబు సర్కారు ముందుకు వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో కడప జిల్లాలో బీసీలకు 5500 మందికి స్వయం ఉపాధి ద్వారా లబ్ధి చేకూర్చాలని అంచనాను నిర్ణయించింది. ఇందుకోసం సబ్సిడీ పరంగా రూ.80 కోట్లు నిధులు విడుదల చేశారు. బీసీ కార్పొరేషను ద్వారా 18 సంవత్సరాలు నిండి 50 సంవత్సరాల్లోపు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. యూనిట్ కాస్ట్‌లో 50శాతం సబ్సిడీ, ఒక యూనిట్ విలువ రూ.2లక్షలు, రూ.3లక్షలు, 5 లక్షలు, 8 లక్షలుగా ఉంది. వీటిలో 50 శాతం సబ్సిడీ ఇస్తారు.

అన్నక్యాంటీన్లలో ఇప్పటి వరకు భోజనం చేసిన వారు..

కడపలో	- 1,41,775
ప్రొద్దుటూరు	- 46,965
జమ్మలమడుగు	- 42,473
పులివెందుల	- 35,249
బద్వేలు	- 24,465
ఎర్రగుంట్ల	- 23,526
మైదుకూరు	- 11,784

కడుపు నింపుతున్న అన్నక్యాంటీన్లు

పొద్దస్తమానం కష్టపడే కార్మికులకు వారికి వచ్చే కూలీ చాలా తక్కువే. అలాగే ఉద్యోగరీత్యా, తమ సమస్యలను మొరపెట్టుకునేందుకు ఉన్నత చదువులు చదివినా ఉద్యోగం రాదనే బెంగతో పలువురు కూలీలు, రైతులు, కార్మికులు నిరుద్యోగులు, బాటసారులు నిత్యం వారు ఉంటున్న పల్లె, శివారు ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఎన్నో ఒడిదుడుకులు ఓర్చి పని దొరుకుతుందనో, ఇతరత్రా హాస్పిటల్‌లో ట్రీట్‌మెంటు కోసమో వస్తుంటా రు. అయితే ఇలాంటి వారి కోసం అభాగ్యులు బయటకు వెళ్లి కనీ సం రూ.50 నుంచి రూ.130 చెల్లించాలి. ఇలాంటి వారి కోసం చంద్రబాబు ప్రభుత్వం అన్నక్యాంటీన్లను మళ్లీ తెరిపించింది. జగన్ హయాంలో కేవలం చంద్రబాబుపై కక్షతో అటకెక్కించారు. ఎంతో మంది పేదలు ఆకలితో అలమటించారు.

అన్నక్యాంటీన్లతో భరోసా

సీఎం చంద్రబాబునాయుడు పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాం టీన్లను తీసుకువచ్చారు. జిల్లాలో కడప, ప్రొద్దుటూరు, జమ్మలమ డుగు, పులివెందుల, బద్వేలు, ఎర్రగుంట్ల, జమ్మలమడుగులో అన్నక్యాంటీన్లు ఉన్నాయి. ఇక్కడ పేదలకు రూ.5కే మంచి రుచికర భోజనం దొరుకుతుంది. కలెక్టరు చెరుకూరి శ్రీధర్ అన్నక్యాంటీన్‌లో క్వాలిటీఫుడ్ లేకుంటే తరచూ చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఉచిత దీపం కనెక్షన్లను సీఎం చంద్రబాబునాయుడు అమలు చేస్తున్నారు. జిల్లాలో శనివారం నాటికి 2,74,598 మందికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్ల పథకంలో సరఫరా చేశారు. వీరిలో 2,69,732 మందికి సబ్సిడీ మొత్తం వారి అకౌంట్లలో రిలీజ్ చేశారు. వాస్తవంగా సిలిండరు తీసుకున్న మహిళలకు రూ.21,84,33,307 డబ్బులు రావాల్సి ఉంది. అయితేఆధార్ ఇతరత్రా సమస్యల కారణంగా ఇప్పటి వరకు 2,63,501 మందికి రూ.20,75,69,084 జమ అయింది.

రైతులకు డ్రిప్ ఇరిగేషన్


జగన్ హయాంలో రైతులకు రూ.7500 ఇచ్చేసి ఇదే రైతులకు సంక్షేమం అంటూ చంకలు గుద్దుకున్నారు. 2023-24లో అప్పటి సీఎం జగన్ జిల్లాలో సూక్ష్మ సేద్యం 12వేల ఎకరాల్లో టార్గెట్‌గా విధించారు. అయితే కూటమి ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం ఆరు నెలల కాలంలో 29,300 టార్గెట్ పెట్టుకుంది.

బీసీలను పూర్తిగా విస్మరించారు..



గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ కార్పొరేషన్, కుల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయకుండా పూర్తిగా విస్మరించారు. ఎన్నికల ముందు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైసీపీ అధ్యక్షుడు జగన్ ఎన్నికల అనంతరం అధికారం చేపట్టి బీసీలను పక్కన పెట్టేశారు. నవరత్న పథకాలకు బీసీ కార్పొరేషన్ నిధులు పక్కదారి మళ్లించి బీసీలను మోసం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేస్తారని ఆశపడ్డ బీసీలకు నిరాశ ఎదురైంది.

- వేణుగోపాల్,
నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టరు



దేహదారుఢ్య పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు

కడప క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా నిర్వహించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు పేర్కొన్నారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు ఆదివారం ఆయన పరీక్షలు జరిగే జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం మైదానంలో కొంత మంది యువకులతో ట్రయల్ రన్ (రిహార్సల్) నిర్వహించారు. అదే విధంగా మైదానంలో అన్ని ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఈ నెల 30 నుంచి జనవరి 8 వరకు పరీక్షలు నిర్వహణ ఉంటుందన్నారు. 3,779 మంది పురుష అభ్యర్థులు, 713మంది మహిళా అభ్యర్థులు మొత్తం కలిపి 4492 మంది ఉన్నారన్నారు. ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. హైస్పీడ్ ఇంటర్‌నెట్, అడ్వాన్స్ సిస్టం, ప్రింటర్స్ సమకూర్చుకుని వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా చూసుకోవాలన్నారు. నియామక ప్రక్రియ యావత్తు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చూడాలన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆర్‌ఎఫ్‌ఐడీ సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఏఆర్) రమణయ్య, జిల్లాలోని పోలీసు అధికారులు, పలువురు జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, ఐటీ కోర్ టీం సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మవద్దు

- ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



కడప (క్రైం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగాల నియామకం విషయంలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఇన్‌చార్జ్ ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏ ప్రభుత్వ ఉద్యోగమైనా, రిక్రూట్‌మెంట్లు అయినా పారదర్శకంగా నిర్వహిస్తారని, మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా మోసాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను ఇప్పటికే చేశామని, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పరీక్షలు నిర్వహించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఉద్యోగాలు ఇప్పిస్తామని, డబ్బులు ఇవ్వమని ప్రచారం చేసే వారే సమాచారాన్ని డయల్ 100కు కానీ డయల్ 112కు కానీ స్థానిక పోలీసులకు తెలిపితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వివరించారు.

రేపే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కడప ఎన్టీఆర్‌సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సామాజిక భద్రత కోసం వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తదితర వర్గాల పేదలకు ఇస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను డిసెంబరు 31న పంపిణీ చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. లబ్ధిదారులు ఎవరైనా అందుబాటులో లేకపోతే జనవరి 2 నుంచి అందజేయాలంటూ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్‌దారుడు మరణిస్తే ఆయన భార్యకు మరుసటి నెల నుంచి పింఛన్ మంజూరు చేయబడుతుందనే విషయాలను పింఛన్ లబ్ధిదారులకు తెలియజేయాలని సూచించారు. కాగా డిసెంబరు నెలకు సంబంధించి 2,58,294మందికి రూ.110.66కోట్లు మంజూరైంది. ఈ మొత్తం ఇప్పటికే డీడీఓలు డ్రా చేసి సచివాలయ సిబ్బందికి అందజేసే ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో మొదటి రోజే 99 శాతం పింఛన్ పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.

నేడు 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

- జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు

కడప కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సోమవారం 19 గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బద్వేలు రెవెన్యూ డివిజన్‌లో అట్లూరు మండలం కమలకూరు, బి.కోడూరు మండలం వేముకుంట, బి.మఠం మండలం గొడ్ల వీడు, బద్వేలు మండలం తిరువెంగళాపురం, కలసపాడు మండలంలో దిగువ తంబళ్లపల్లి, మైదుకూరు మండలం శెట్టివారిపల్లి, పోరుమామిళ్ల మండలం సంచర్ల, పులివెందుల డివిజన్‌లోని చక్రాయపేట మండలం కొండప్పగారిపల్లి, ఎర్రబల్లి, జమ్మలమడుగు మండలం కన్నెలూరు కొండాపురం మండలంలో కె.వెంకటాపురం, మైలవరం మండలం నవాబుపేట, దుగ్గనపల్లి, రాజు పాలెం మండలం జొన్నవరం, కడప రెవెన్యూ డివిజన్‌లోని పెండ్లిమర్రి మండలం సంగటిపల్లి, వల్లూరు మండలంలోని లేబాక ఖాజీపేట మండలంలోని చెముల్లపల్లి, సీకేదిన్నె మండలం రుద్రయ్యగారిపల్లి వెరసి మొత్తం 19 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయని డీఆర్వో ఆ ప్రకటనలో తెలిపారు.

న్యాయం చేయాలంటూ.. రోడ్డుపై మహిళ బైఠాయింపు

- ఉదయం నుంచి రాత్రి వరకు పోరాటం
- జాలి చూపని అధికారులు, పోలీసులు..!





పులివెందులలో రోడ్డుపై బైఠాయించిన బషిరూన్‌బీ.. తన తండ్రి రాయించిన ఇంటి పత్రాన్ని చూపుతున్న బషిరూన్‌బీ

పులివెందులరూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తన తండ్రి రాసిచ్చిన ఇంటిని తనకు కాకుండా చేస్తున్నారు.. పదిహేనేళ్లుగా పోరాడుతున్నా తనకు న్యాయం జరగడం లేదంటూ ఓ మహిళ రోడ్డుపై బైఠాయించి ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. పులివెందుల పట్టణం పుల్లారెడ్డి ఆసుపత్రి సమీపంలోని మెయిన్‌రోడ్డులో పాడుబడ్డ ఇంట్లో నివాసముంటున్న షేక్ బషిరున్‌బీ అనే బాధిత మహిళ తెలిపిన వివరాల మేరకు... 1978లో సర్వే నెంబరు 56లో తన తండ్రి షేక్ ఖాదర్‌సాహెబ్‌కు పట్టా స్థలం ఉండేదని, ఆ స్థలంలో తన ముగ్గురు అన్నలు, అక్కలతో పాటు తనకు కూడా తన తండ్రి ఇల్లు రాయించారని తెలిపారు. అప్పటి నుంచి ఎవరి ఆస్తి వారు అనుభవిస్తూ వచ్చేవారమన్నారు. తనకు ఇంకా వివాహం కానందున తన తండ్రి రాసిచ్చిన ఇంట్లోనే ఉంటున్నానన్నారు. అయితే 2010 సంవత్సరం కంటే ముందు తనకు తెలియకుండా ఇతర ఆస్తులతో పాటు తాను ఉంటున్న ఇంటిపై కూడా తన తోడబుట్టిన వారు రుణం తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తనకు వివాహం కాకున్నా అయినట్లు, విజయవాడలో ఉంటున్నానని చెప్పి తన ఇంటిపై బ్యాంకులో రుణం తెచ్చుకున్నారని తెలిపారు. ఒంటరిగా ఉంటున్న తనకు డబ్బు అవసరమై బ్యాంకులో రుణం కోసం వెళ్లగా అప్పటికే బ్యాంకులో రుణాలు తెచ్చుకున్నారని మేనేజర్ తెలిపారని, ఇందులో అధికారులతో కలిసి తన సోదరులు కాగితాలు పుట్టించి రుణాలు తెచ్చుకున్నారని ఆరోపించారు. వీటితో పాటు తన తండ్రి ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో కూడా తనకు ఒక్కరూపాయి ఇవ్వలేదని కన్నీరు మున్నీరయ్యారు. ఈ న్యాయపోరాటం కోసం తాను కూడబెట్టుకున్న డబ్బు, బంగారం అన్నీ అమ్ముకుని ప్రస్తుతం పాడుబడ్డ ఇంట్లోనే ఉంటున్నానని తీవ్ర మనోవేదన చెందారు. అప్పటి నుంచి జిల్లా అధికారులు, పోలీసుల చుట్టూ తిరుగుతున్నా తనకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకు రోడ్డుపైనే కూర్చుంటానని తెగేసి చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 8వరకు ఓ మహిళ నిరసన తెలుపుతున్నా ఏ అధికారి గాని, ప్రజాప్రతినిధులు గాని రాకపోవడం దారుణం. ఏమీలేని ఓ మహిళకు అండగా నిలిచేందుకు ఏ ఒక్కరూ చొరవ చూపకపోవడం బాధాకరమని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎస్‌ఐ నారాయణ అక్కడకు చేరుకొని సమస్యపై తహసీల్దార్‌తో రేపు మాట్లాడదామని సర్దిచెప్పి పంపారు.

వర్రా కేసులో మరో ఇరువురి విచారణ

- 41ఏ నోటీసులు జారీ
- మరో 55 మందిని విచారించే అవకాశం

పులివెందులటౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టింగులు పెట్టిన కేసులో విచారణ కొనసాగుతోంది. ఇప్పటికే ఈ కేసులో వర్రా రవీంద్రనాథరెడ్డి మరో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండు విధించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆదివారం పులివెందుల డీఎస్పీ మురళి గాలివీడుకు చెందిన హనుమంత్‌రెడ్డి, తాడిపత్రికి చెందిన హరినాథ్‌రెడ్డిలను విచారించారు. అనంతరం వారిరువురికి 41ఏ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రతినిధి డీఎస్పీ మురళిని వివరణ కోరగా, వర్రా కేసులో రాష్ట్రవ్యాప్తంగా 70 మందికి పైగా నిందితులుగా కేసు నమోదు చేశామని, ఇందులో 15 మందిని మాత్రమే విచారించామన్నారు. ఇంకా దాదాపు 55 మందిని విచారించాల్సి ఉందని, త్వరలో విచారణ చేపడతామని తెలిపారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప (క్రైం), డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గురునాథ్‌ను సస్పెండ్ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్‌గా ఉన్న ఈయన ఎస్‌ఐనని చెప్పుకుంటూ ఇతరులను బెదిరింపులకు పాల్పడడం, సక్రమంగా విధులకు వెళ్లకుండా ఉండడంతో అతనిపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు అతన్ని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

గువ్వలచెరువు సొరంగమార్గం పరిశీలన

కడప-చిత్తూరు జాతీయ రహదారిని పరిశీలిస్తున్న అధికారులు



రామాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో సొరంగ మార్గం ఏర్పాటులో భాగంగా ఆ ప్రాంతాన్ని ఢిల్లీకి చెందిన చీఫ్ ఇంజనీర్ రాహుల్ గుప్తా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు కిలోమీటర్లు పొడవు ఉండేలా ఈ సొరంగ మార్గాన్ని నిర్మించే అవకాశం ఉందన్నారు. ఘాట్ రోడ్డు కారణంగా వాహనాలు లోయలో పడి పలువురు ప్రాణాలు కోల్పోతున్న విషయం గమనించిన కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతంలో సొరంగమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో విజయవాడకు చెందిన జాతీయ రహదారుల శాఖ రీజనల్ అధికారి లోకేశ్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ హరిప్రసాద్, కడప ఈఈ భాస్కర్ రెడ్డి, ఏఈ విశ్వనాథ్ పాల్గొన్నారు.

రైతు కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ



నాగేంద్ర తోట వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో

నేడు 'డయల్ యువర్ కలెక్టర్'

కడప కలెక్టరేట్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహణలో భాగంగా సోమవారం ఉదయం 9-30 నుంచి 10 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతోందని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డయల్ యువర్ కలెక్టర్‌కు ఫిర్యాదులు చేయాల్సినవారు 08562-244437కు ఫోన్ ద్వారా చేయవచ్చని, అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

తాత్కాలిక మార్కెట్‌లో ఆక్రమణలు

- రాత్రికి రాత్రే కంటైనర్, రేకుల షెడ్డు ఏర్పాటు
- తలలు పట్టుకుంటున్న ప్రొద్దుటూరు మున్సిపల్ అధికారులు



కూరగాయల మార్కెట్‌లో అనధికారికంగా కంటైనర్, షెడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

ప్రొద్దుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో ఆక్రమణలు సాగుతున్నాయి. మున్సిపల్ అధికారుల అనుమతులుగానీ, కౌన్సిల్ తీర్మానం లేకుండా అక్రమంగా షెడ్డు, కంటైనర్‌ను అక్కడ కొందరు అధికార ప్రతిపక్ష పార్టీల నేతలు ఏర్పాటు చేశారనే ప్రచారం సాగుతోంది. ఈ నెల 9వ తేదీన మార్కెట్‌లోని ఖాళీ స్థలంలో అక్రమంగా షెడ్ల నిర్మాణం చేపట్టడానికి కొందరు అధికార పార్టీ వ్యక్తులు ప్రయత్నించగా రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. తిరిగి వారం క్రితం అధికార పార్టీకి చెందిన ఓ మాజీ కౌన్సిలర్ అండతో అక్కడ రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి యత్నించగా అధికారపార్టీ పెద్దల ఒత్తిళ్లతో సాధ్యం కాలేదు. దీంతో తిరిగి బుధవారం రాత్రి ప్రతిపక్ష పార్టీకి చెందిన వైస్ చైర్మన్ అండతో కొందరు ఏకంగా ఒక పెద్ద కంటైనర్‌ను తెచ్చి పెట్టారు. ఇప్పుడు రెండు వర్గాలు ఆ ఖాళీ స్థలంలో షెడ్లు వేయడానికి పోటీ పడుతున్నాయి. ఈ పరిస్థితి అధికారులకు సంకటంగా మారింది.

కాగా.. వైసీపీ హయాంలో తాత్కాలిక మార్కెట్‌లో వ్యాపారులకు వేసిన షెడ్లు కాకుండా అక్రమంగా 21 షెడ్లు ఏర్పాటు చేసి తమ కార్యకర్తలకు అనుయాయులకు కౌన్సిల్ తీరానం లేకుండా అప్పగించారు. వైసీపీకి చెందిన వారు వాటిని మార్కెట్‌లోని వ్యాపారులకు విక్రయించి లక్షలు సొమ్ము చేసుకున్నారని ఆరోపణలున్నాయి. ఇప్పుడు తమకు అధికారం ఉందని తాత్కాలిక మార్కెట్‌లో మూడు చిన్న షెడ్లువేసి తమ కార్యకర్తలకు అప్పగించాలని అనుకుంటుంటే వైసీపీ అధికారంలో లేకున్నా తమతో పోటీ పడుతున్నారని టీడీపీ వర్గాలు అంటున్నాయి. చట్టప్రకారం నడచుకోవాలని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నా ఇరువర్గాలు లెక్కచేయడం లేదు.

తాత్కాలిక మార్కెట్‌లో ఆక్రమణలపై కమిషనర్ మల్లికార్జునను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రేకుల షెడ్డుతో పాటు ఒక కంటైనర్ అక్కడ ఎవరు ఏర్పాటు చేశారో తెలీదని అన్నారు. మార్కెట్‌లో ఉంచడానికి అనుమతులు లేవని వాటిని తొలగించాలని నోటీసులు అంటిస్తామన్నారు. నోటీసులకు స్పందించకుంటే వాటిని తాత్కాలిక మార్కెట్ నుంచి తామే తొలగిస్తామన్నారు.

బీసీలకు రాయితీ రుణాలు

● ప్రభుత్వానికి ప్రతిపాదనలు

● 5032 మందికి రూ.79.78కోట్ల ప్రయోజనాలు

కడప ఎన్జీఆర్ సర్కిల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా రాయితీ రుణాలు అందించి బీసీ సామాజిక వర్గాల్లో వేలాదిమందికి వివిధ రకాల ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించడంతో పాటు ప్రతిపాదనలు పంపాలంటూ ఆదేశాలు ఇచ్చింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం తమ ఐదేళ్ల పాలనలో బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇచ్చిన పరిస్థితి లేదు. 2014-2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన అనంతరం లోటు బడ్జెట్ ఉన్నప్పటికి బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ రాయితీ పథకాలను అమలు చేసిన పరిస్థితి ఉంది. ఇపుడు కూటమి ప్రభుత్వంలో అతిపెద్ద పార్టీగా టీడీపీ పేద ప్రజలకు జీవనోపాదులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇక మిగిలింది మూడు నెలలు మాత్రమే. ఈ వ్యవధిలో సమయానికి తగిన విధంగా ప్రతిపాదనలు రూపొందించమని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు తెలుస్తోంది.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రభుత్వ ఆదేశాల మేరకు బీసీ కార్పొరేషన్ అధికార యంత్రాంగం తాజా ప్రతిపాదనలు రూపందించి ప్రభుత్వానికి నివేదించింది. ఇందుకు సంబంధించి వివరాలు పరిశీలిస్తే... బ్యాంకు లింకేజీతో కూడిన స్వయం ఉపాధి పథకాలకు బీసీ కార్పొరేషన్ రాయితీ ఇవ్వనుంది. 1550 మందికి రూ.31కోట్లు ప్రయోజనం చేకూరనుంది. బ్యాంకు లింకేజీ లేకుండా ఎన్‌బీసీఎఫ్‌డీసీ ద్వారా బీసీ కార్పొరేషన్ రుణాలు ఇవ్వనుంది. ఈ పథకం ద్వారా 61 మందికి రూ.7.33కోట్లు రుణాలు మంజూరు కానున్నాయి. పాడి పరిశ్రమ ద్వారా బీసీ సామాజిక వర్గాలకు చెందిన 500 మందికి రూ.25కోట్లు మినీ డెయిరీలు మంజూరు చేయనున్నారు. కురబ, యాదవులకు మేకలు, గొర్రెల పెంపకం కోసం 105 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.10కోట్ల రుణాలు అందించనున్నారు. మేదర, కుమ్మరి, శాలివాహనులకు చెందిన వారికి స్వయం ఉపాధి కల్పన కోసం 118 మందికి రూ.3.54 కోట్లు, బీసీ నిరుద్యోగ యువతకు జనరిక్ మెడికల్ షాపులు 32 యూనిట్ల ఏర్పాటుకు రూ.2.56 కోట్లు, బేసిక్ టైలరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద ఫ్యాషన్ డిజైనింగ్‌కు 1770 యూనిట్ల కోసం రూ.4.43 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఈవెంట్ మేనేజ్‌మెంట్ కింద శిక్షణ కార్యక్రమం 350 యూనిట్లకు రూ.1.75కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆసుపత్రి సెక్టార్ కింద శిక్షణ కార్యక్రమ 350 యూని ట్లు రూ.0.87కోట్లు ఖర్చు చేయనున్నారు. వడ్రంగి కింద శిక్షణ కార్యక్రమం 200యూనిట్లకు రూ.1.20కోట్లు ప్రతిపాదనలు రూపొందించారు.

5036యూనిట్లకు రూ.79.78కోట్లు

బీసీ సామాజిక వర్గాల్లోని వివిధ ఉపకులాలకు ప్రయోజనం కలిగేలా ప్రతిపాదనలు రూపొందించినట్లు బీసీ కార్పొరేషన్ అధికార యంతారంగం చెబుతోంది. మొత్తం 5036 యూనిట్లకు గాను రూ.79.78 కోట్లు ప్రతిపాదనలు రూపొందించి పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ ఆర్థిక సంవత్సర చివరి నాటికి గ్రౌండింగ్ చేసే దానికి అవకాశాలు ఉన్నాయి. ముందుగా అర్హులైన వారి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తారు. దరఖాస్తు గడువు ముగియగానే అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. ఇప్పటికే వివిధ కులసంఘాల నాయకులు అధికారులను కలిసి నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయాలంటూ విన్నవిస్తున్నారు. సంవత్సరాల నుంచి గత ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బీసీ కార్పొరేషన్ వైపు వివిధ సంఘాల నాయకులు కన్నెత్తి చూసింది లేదు. ఇపుడు ప్రభుత్వం మారడంతో బీసీల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

ప్రతిపాదనలు ఆమోదించగానే యూనిట్ల మంజూరు



ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలోని బీసీలకు రాయితీ రుణాలు అందించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే జిల్లా కలెక్టర్ అనుమతితో అమలు చేయడం జరుగుతుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి.. అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా యూనిట్ల మంజూరుకు చర్యలు తీసుకుంటాం.

- జయసింహ, ఈడీ,బీసీ కార్పొరేషన్

ఉద్యోగావకాశాలకు క్రీడలు దోహదం

● జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగావకాశాలు పొందేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని.. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు 3శాతం రిజర్వేషన్ కోటాను ఉద్యోగ కల్పనలో అమలు చేస్తున్నదని జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక గాంధీనగర్ మునిసిపల్ కార్పొరేషన్ స్కూల్‌లో 50వ జిల్లా కబడ్డీ జూనియర్ బాల, బాలికల ఎంపికల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే ఏ క్రీడల్లో అయినా ప్రతిభ చాటవచ్చన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు వచ్చే జనవరి 3 నుంచి 6వ తేదీ వరకూ కర్నూలు పట్టణంలో జరుగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి వుందన్నారు. అనంతరం ప్రతిభ చాటిన వారిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి జనార్థన్, కో-ఆర్డినేటర్ సంపత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

బాలుర విభాగంలో ఎంపికైన క్రీడాకారులు

పవన్, వంశీ, విజయేంద్రప్రకాష్, బి.లోకేష్, బి.శివకుమార్, టి.ఉదయ్‌కుమార్, డి.నవనీత్, పి.సుదర్శన్, జి.రెడ్డిప్రసాద్, డి.వర్థన్, ఎస్.విష్ణు, ఎస్.రిహాన్ బాషతో పాటు స్టాండ్ బైగా ఎస్.చంటి, వై. శ్రీవిష్ణు, కె. మణికంఠ ఎంపికయ్యారు.

బాలికల విభాగంలో ...

పి.నాగశృతి, ఎస్.శ్యామల, కె.వెంకట పల్లవి, ఎన్.నవనీత, కె.హేమవర్షిణి, బి.భవానీ, పి.అనుదీక్షిత, ఎం.ప్రమీల, సాయిహర్షిత, గురు స్పందన, టి.సౌమ్య, శ్రీ వర్షిత, జె.అనూషతో పాటు స్టాండ్‌బైగా ఆర్.అనురాధ, టి. శిరీష, బి.నిహితరెడ్డి ఎంపికైన వారిలో ఉన్నారు.

గువ్వల చెరువు ఘాట్‌లో అదుపుతప్పిన లారీ

● తప్పిన పెను ప్రమాదం



సికెదిన్నె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గువ్వల చెరువు ఘాట్‌లో ఆదివారం లారీ అదుపు తప్పి లోయలో పడిన ప్రమాదంలో డ్రైవర్ క్రిష్ణ, క్లీనర్ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చింతకొమ్మదిన్నె పోలీసులకు వివరాల మేరకు... కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో రాయచోటి వైపు నుంచి కడపవైపునకు జూస్ లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పింది. అయితే డ్రైవర్ చాకచక్యంగా ప్రహరీగోడను ఢీకొట్టి నిలిపే ప్రయత్నం చేసినప్పటికి పది అడుగుల లోయలో పడింది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆర్డీఓ విచారణ

సింహాద్రిపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దెకుంట్లలో జరిగిన నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలపై ఆదివారం పులివెందుల ఆర్డీఓ జి.చిన్నయ్య, తహసీల్దార్ నాగేశ్వరరావులు విచారణ చేపట్టారు. నాగేంద్ర సాగు చేస్తున్న చీనీ తోటను, అక్కడ ఉరి వేసుకుని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నాగేంద్ర ఇంటిలో భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు నాగేంద్ర బంధువులను అడిగి తెలుసుకున్నారు. ఆర్డీఓ సమక్షంలో నాగేంద్ర ఇంటిలోని బీరువాలో వున్న వస్తువులను ఎస్ఐ తులసీనాగేంద్రప్రసాద్ పరిశీలించారు. ఆత్మహత్యలకు గల కారణాలు ఏమైనా దొరుకుతాయేమోనని బీరువాలు, ఇంటిలోని పరిసరాలు పరిశీలించారు. డిప్యూటీ తహసిల్దార్ హరిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వం బాధ్యత వహించాలి

దుద్దెకుంట్ల గ్రామంలో జరిగిన కొమెర నాగేంద్ర కుటుంబీకుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వరులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. నాగేంద్ర కుటింబీకుల ఆత్మహత్యలపై పౌరహక్కుల సంఘం కడప జిల్లా శాఖ నిజ నిర్ధారణలో తేలిన వాస్తవాలను ఆయన విలేకరులకు వివరించారు. దీనికంతటికి కారణం నాగేంద్రకు ఉన్న ఒకటిన్నర ఎకరాల పొలమే కాకుండా 13 ఎకరాలు భూమిని కౌలుకు తీసుకున్నాడు. గత ఆరు ఏడేళ్లుగా పంటలు సాగు చేయడానికి పెట్టుబడులు పెడుతూ సుమారు 30 లక్షలు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు ఇచ్చినవారు వత్తిడి చేయడంతో చేసిన అప్పులు తీర్చే మార్గం లేక దిక్కుతెలియనిస్థితిలో కుటుంబం ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. ఆరుగాలం కష్టపడి వ్యవసాయాన్ని నమ్ముకుని పెట్టుబడి కూడా రాకపోవడంతో నాగేంద్ర కుటుంబం ఆత్మ హత్యకు పాల్పడటం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలంటే పాలకులు రైతాంగం కోసం వ్యవసాయానికి పెట్టుబడి నిధులు సమకూర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు రెడ్డయ్య, సహాయ కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.



నాగేంద్ర తోట వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ చిన్నయ్య,రెవిన్యూ అధికారులు

వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలి



వడ్డెర మహాగర్జనలో మాట్లాడుతున్న ఏపీ వడ్డెర రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి

పెద్దమండ్యం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఏపీ వడ్డెర సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవర్ల మురళి, రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి సమీపంలో జిల్లా వడ్డెర సంఘం మహాగర్జన కార్యక్రమం మండల వడ్డెర సహకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వడ్డెర రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ వడ్డెర హక్కుల సాధనకు సమిష్టిగా ముందుకు సాగాలన్నారు. వడ్డెరలకు టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలన్నీ వడ్డెరులను ఓటు బ్యాంక్‌గా వాడుకుంటున్నారు తప్ప రాజకీయంగా గుర్తింపు ఇవ్వలేదని, రాష్ట్రంలో 40 లక్షల మంది వడ్డెరలు ఉన్నా తగిన న్యాయం జరగలేదన్నారు. జిల్లా వడ్డెర సంఘం అధ్యక్షుడు డేరంగుల నారాయణ, తంబళ్లపల్లి నియోజకవర్గ వడ్డెర అధ్యక్షుడు నాగమల్లప్ప, డాక్టర్ లక్ష్మీప్రసాద్, శంకరప్ప సాంబశివ, ఎంఎల్ రమణ, హరి, మేకల చలపతి, జిల్లా, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో వడ్డెరలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రామచంద్రయ్యను పరామర్శించిన మంత్రులు, పార్టీల నేతలు





రామచంద్రయ్యను పరామర్శిస్తున్న మంత్రి ఫరూఖ్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, విష్ణుస్వరూప్ అంత్యక్రియలకు హాజరైన వివిధ పార్టీల నాయకులు

కడప స్పోర్ట్స్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య కుమారుడు విష్ణుస్వరూప్ తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లో శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. విష్ణుస్వరూప్ భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కడపకు తీసుకొచ్చారు. ఆదివారం కో-ఆపరేటివ్ కాలనీలోగల సీఆర్‌సి గృహంలో భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు.

కన్న కొడుకు మృతితో తీవ్ర మనోవేదనకు గురైన రామచంద్రయ్యను పలువురు నేతలు పరామర్శించారు. వారిలో రాష్ట్ర మంత్రి ఫరూఖ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, వీఎస్ అమీర్‌బాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ఎస్.గోవర్థన్‌రెడ్డి, హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే బాబూరావు, టింబర్‌డిపో శ్రీనివాసులు, సంగం అదినేత నసీరుద్దీన్, బద్వేల్ టీడీపీ నాయకులు రాంబాబు, వైసీపీ నాయకులు అంజాద్‌బాష, నగర మేయర్ సురేష్‌బాబు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు తులసిరెడ్డి, మాజీ నాయకులు నజీర్ అహ్మద్, జనసేన జిల్లా కన్వీనర్ సుంకర శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు వీవీ చలపతి, పెద్ద దర్గా పీఠాధిపతి ఆరిఫుల్లా హుస్సేని, రామసుబ్బారెడ్డి, (వైసీపీ), బత్యాల చెంగల్‌రాయులు, (టీడీపీ), రమేష్‌రెడ్డి (వైసీపీ), ఆరిఫుల్లా (టీడీపీ) తదితరులతో పాటు ఎలువురు కార్పోరేటర్లు, అభిమానులు, మిత్రులు, బంధువులు ఉన్నా రు. కాగా, ఆదివారం మధ్యాహ్నం చలమారెడ్డిపల్లెలోని రామచంద్రయ్య సొంత పొలంలో విష్ణుస్వరూప్ అంత్యక్రియలు నిర్వహించారు.

పెద్దదర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

కడప క్రైం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కడప అమీన్‌పీర్‌దర్గాపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన ముత్తవల్లి షకీల్ షఫీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తూ పెద్ద దర్గా గౌరవాన్ని తీస్తుండడంతో దర్గా సంబంధించిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎంపిక





ఎం.అబ్దుల్ రషీద్, వసీవుల్లా బఖ్తీయారి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉర్దూ అధ్యాపకుల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ వసీవుల్లా బఖ్తీయారి, ఎం.అబ్దుల్ రషీద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదివారం కడప నగరం రూట కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూట) ఆధ్వర్యంలో రాష్ట్ర ఉర్దూ లెక్చరర్స్ వింగ్ ఏర్పాటు చేశారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ హిదాయతుల్లా మాట్లాడుతూ రూట ఆధ్వర్యంలో ఉర్దూ మీడియంను అంగన్వాడీల నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు స్థాపనకు, పటిష్టపరిచేందుకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. చీఫ్ పాటర్న్‌గా సయ్యద్ హిదాయతుల్లా, గౌరవ అధ్యక్షులుగా హఫీజ్, షేక్ అహ్మద్ సలహాదారులుగా డాక్టర్ ముహమ్మద్ నిసార్ అహ్మద్, డాక్టర్ ఎన్.అయ్యూబ్ హుస్సేన్, రాష్ట్ర సమన్వయకర్తగా షేక్ ముహమ్మద్ అయ్యుబ్ ఎంపికయ్యారు.

పూర్తి పింఛన్ ఇప్పించండి సారూ...

● శారీరక, మానసిక రోగి తల్లిదండ్రుల వినతి

పెండ్లిమర్రి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): 'మా బిడ్డకు నరాల జబ్బు.. ఎన్నో ప్రాంతాలు తిరిగాం.. రూ.లక్షలు అప్పు చేసి ఖర్చు చేశాం. నయం కాలేదు. మంచానికే పరిమితమయ్యాడు. అప్పులపాలయ్యాం. కుటుంబాన్ని పోషించుకునేందుకు చాలా ఇబ్బంది పడుతున్నాం. అన్ని అర్హతలూ ఉన్న మా బిడ్డకు పూర్తి పింఛన్ ఇచ్చి ఆదుకోండి సారూ...' అంటూ ఓ వ్యాధిగ్రస్థుడి తల్లిదండ్రులు విన్నవిస్తున్నారు. ఆ వివరాలు ఇవీ....

మండల పరధిలోని నాగాయపల్లెలో మైసూరారెడ్డి, రాములమ్మ దంపతులకు ఒక కుమారుడు రామసుబ్బారెడ్డి, కుమార్తె స్వాతి ఉన్నారు. ఒక ఎకరం పొలం ఉంది. ఆ దంపతులిద్దరు తమ పొలంలో వ్యవసాయ చేసుకుంటూ కూలి పనులకు వెళుతూ పిల్లలను పెంచి పెద్ద చేశారు. కుమారుడు రామసుబ్బారెడ్డి ఇంటర్ వరకు బాగా చదువుకుంటూ ఆరోగ్యంగా ఉండేవాడు. ఏమైందో ఏమో కానీ ఇంటర్ ద్వితీయ సంవత్సరం నుంచి నరాలు పనిచేయడం మానేశాయి. ఏమైందో అర్థం కాక అతని తల్లిదండ్రులకు బెంగుళూరు, చెన్నై, విజయవాడ, కేరళ ఇలా ఎన్నో ఆసుపత్రులకు కుమారుని ఆరోగ్యం బాగుచేయాలని తిరిగినా ఫలితం లేదు. రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తూ ఉండే తప్ప మెరుగు పడడం లేదు. వృద్ధాప్యంలో ఆసరాగా కొడుకు ఉంటాడని రూ.20లక్షల అప్పు చేసి ఆసుపత్రుల చుట్టూ తిరిగినా జబ్బు నయం కాలేదు. ఇక తల్లిదండ్రులు చేసేది లేక కూలినాలి చేసుకుంటూ మంచంపై ఉన్న తన కుమారుని బాగోగులు చూసుకుంటున్నారు. మంచంపైనే కాలకృత్యాలను చేయాలి. భోజనం తినిపించడానికి అరగంట పడుతుంది. 20 రోజులకు 30 రోజులకు ఒకసారి అంబులెన్స్‌లో రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లాలి. చేతికి అందివచ్చిన కొడుకు ఇలా అయ్యేసరికి కూలి పనులు చేసుకునే మేము కూడా నిస్సహాయ స్థితిలోకి వెళ్లిపోయామని యువకుడి తల్లిదండ్రుల ఆవేదన చేస్తున్నారు. ప్రస్తుతం దివ్యాంగుల పింఛన్ కింద రూ.6వేలు ఇస్తున్నారని, రూ.15వేలు దివ్యాంగుల పింఛన్‌కు అన్ని అర్హతలు ఉన్న సాంకేతిక కారణాలు చూపుతున్నారని.. దయచేసి అధికారులు స్వయంగా వచ్చి పరిశీలించి న్యాయం చేయాలని కోరుతున్నారు.



దివ్యాంగుడు రామసుబ్బారెడ్డి



రిమ్స్ వైద్యులు జారీచేసిన దివ్యాంగుల అర్హత ధ్రువీకరణ పత్రం

గండికోట చరిత్రను యువత తెలుసుకోవాలి

● నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భారతేశంలో సహజసిద్దంగా ఏర్పడిన గండికోటను యువత సందర్శించడం శుభపరిణామమని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి మణికంఠ పేర్కొన్నారు. ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఎక్సేంజ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం గండికోటను విశాఖ జిల్లా యువత సందర్శించారు.

భారతదేశంలో సహజ సిద్ధంగా ఏర్పడిన పుణ్యస్థలం గండికోట అన్నారు. ఇతర జిల్లాలోని చారిత్రక ప్రదేశాలను సదర్శించడం వలన పురాతనమైన కట్టడాలపైన యువతకు అవగాహన ఏర్పడుతుందన్నారు. పురాతన చరిత్రను, స్థలాలను యువతరానికి అందించడం కోసం ప్రతి ఒక్కరు విశేష కృషి చేయాలన్నారు. కోటలో ఉన్న పురాతన శాసనాలను, రాతికట్టడాల విశిష్టతను యువతకు తెలియజేసినట్లు చెప్పారు.



సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి

కమలాపురం రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సీపీయం 12వ జిల్లా మహాసభలు, జనవరి 4,5 తేదీల్లో నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మార్కెట్ యార్డు ఆవరణంలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహాసభ సందర్భంగా బహిరంగసభ ఉంటుందని, ఈ సభకు ముఖ్యఅతిథిగా కామ్రేడ్ ఎం.ఎగఫూర్, కె.ప్రభాకర్ రెడ్డి హాజరవుతారన్నారు.బహిరంగసభ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, రాజేశ్, ముక్తియార్, పండు, డానియేల్, దాదాపీరు, రమేశ్, రామాంజనేయులు, రఫీ, షామీర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



చిత్రం చెప్పిన సమస్య

పులివెందుల పట్టణంలోని బాకరాపురం వద్ద సర్కిల్‌లో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ సర్కిల్ అటు పట్టణంతో పాటు ఆటోనగర్, బాకరాపురం, కడపకు వెళ్లే దారులను కలుపుతుంది. ఈ సర్కిల్‌లో రోడ్డు పనులు పూర్తిచేయలేదు. దీంతో అక్కడ పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, పాదచారులు నరకం చూస్తున్నారు. వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -పులివెందుల రూరల్, (ఆంధ్రజ్యోతి)

ఎంపీడీవోపై వైసీపీ గూండాల దాడి బాధాకరం

● ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ



ఎంపీడీవోను పరామర్శిస్తున్న కేవీ రమణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు, అనితాదీప్తి, గన్నేపాటి మల్లేశ్

కడప మారుతీనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై వైసీపీ గూండాల దాడి బాధాకరమని ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమణ డిమాండ్ చేశారు.దాడికి తెగబడిన సుదర్శన్‌రెడ్డి, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని కోరారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎంపీడీఓను ఆదివారం ఆయనతోపాటు వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు బాబు మోజెస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పరామర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దాడికి పాల్పడిని వారు ఎంతటి వారైనా, ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హోం శాఖమంత్రి అనితను కోరారు.

ఎంపీడీవోను పరామర్శించిన డైరెక్టర్లు

కడప(వినాయకనగర్), డిసెంబరు29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల దాడిలో గాయపడిన గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబును ఆదివారం ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు గన్నేపాటి మల్లేశ్, దుద్యాల అనితాదీప్తి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి అని చిన్న చూపు చూసి గాయపర్చడం భావ్యం కాదన్నారు. దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని కోరారు. టీడీపీ సీనియర్ నేత జయచంద్ర, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ అధికారులపై దాడులు అమానుషం

వీరపునాయునిపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇలాంటి దాడులు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు కడపలో విలేకరులతో మా ట్లాడారు.

ఎంపీడీవోపై దాడి విచారకరం

కడప రూరల్, డిసెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో జవహర్‌బాబుపై దాడిని పంచాయతీరాజ్ చాంబర్ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీవోను పరామర్శించేందుకు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ సోమవారం ఉమ్మడి కడప జిల్లాకు వస్తున్నారన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాల్లో విరివిగా పాల్గొనాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంఘం అభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా విరివిగా పాల్గనాలని డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరం పద్మశాలి భవన్‌లో పద్మశాలి ఉద్యోగుల సంక్షేమ సంఘం సమావేశం అధ్యక్షులు డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి ప్రతి సభ్యుడు కృషిచేయాలన్నారు. పరిశీలకుడిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోము జ్ఞానశంకర్ హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ చుప్పల విజయకుమార్ నూతన సభ్యులను పరిచయం చేశారు. ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖ వైద్యులు డాక్టర్ సామా బాలసుబ్రమణ్యం, డాక్టర్ సామా సుధ దంపతులు, డాక్టర్ అవ్వారు అరుణ్ డైరీని ఆవిష్కరించారు. డాక్టర్ మామిళ్ల మల్లికార్జున, డాక్టర్ మామిళ్ల సునీల్‌కుమార్ చేతులమీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, వద్ది మాధవ, హెడ్మాస్టర్ విజయలక్ష్మి, ఇంజనీర్ సాధు శివ, వద్ది చైతన్య, రిటైర్డ్ డైట్ లెక్చరర్ కృష్ణయ్య, తిరుమల కొండు, విజయకుమార్‌తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గునిశెట్టి శ్రీనివాసులు

సమావేశం నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, కడప జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ కోరారు. దీంతో పలు సంఘటనలకు పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. కనీసం మూడు నెలలకు ఒకసారి సమావేశాలు ఉంటే విద్యాశాఖ ఒడిదుడుకులు లేకుండా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశాలు ఉపాధ్యాయులకు దిశా నిర్దేశం కాగలవన్నారు. దీనిపై ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సమావేశాలు లేకపోవడమే ఇటీవల జరిగిన సంఘటనలకు నిదర్శనమన్నారు.

దుప్పట్ల పంపిణీ

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం ఆవోపా ఉపాధ్యక్షురాలు మధులత సహకారంతో దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు అధ్యక్షుడు సాదు కృష్ణవేణి తెలిపారు. అనంతరం మధులతను సత్కరించారు. రాష్ట్ర సభ్యుడు ఆకుల సత్యప్రసాద్, కోశాధికారి రెడ్డి లక్ష్మి, ఉపాధ్యక్షురాలు కల్పనదేవి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

3,4 తేదీలలో లూయిబ్రెయిలీ జయంతి వేడుకలు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకరాపురం అంధుల పాఠశాలలో జనవరి 3,4 తేదీలలో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు పి.పార్థసారధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప, అన్నమయ్య జిల్లాల అంధ ఉద్యోగులు ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బందికి 3,4,5 తేదీలలో ఓడీ సౌకర్యం కూడా ఉన్నట్లు చెప్పారు. ఆటల పోటీలు, బస్‌పాస్‌లు కూడా ఇప్పించడం జరుగుతుందని, వివరాలకు 9440994892 నంబరుకు సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు.

వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిరక్షించాలి

● ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్

కడప మారుతీనగర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు స్థలాలను పరిరక్షించాలని ముస్లిం సమైక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ డిమాండ్ చేశారు. ముస్లిం సమైక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని మదరసా మదీన తుల్ ఉలూమ్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వక్ఫ్‌బోర్డు చట్టాన్ని ముస్లిం సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనలు చేపట్టడంతో కాస్త వెనకడుగు వేసిందన్నారు. పాలక ప్రభుత్వాలు సచార్, రంగనాథ్ కమిటీల సిఫారసులను అమలు చేయకుండా ముస్లింలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేదిక నాయకులు అహ్మద్ చందన్, మహబూబ్ అలీ, మౌలాబేగ్, సాదిక్, అన్వర్, రహీమ్‌ఖాన్, అబ్దుల్ కలాం, నూర్‌ఖాన్, మెహతాజ్ బేగం, నసీమా పర్వీన్, శాబుద్దీన్ పాల్గొన్నారు.


సభ్యత్వంతో టీడీపీని బలోపేతం చేద్దాం



చెన్నూరులో సభ్యత్వ నమోదులో పాల్గొన్న టీడీపీ నేతలు

చెన్నూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వంతో టీడీపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బస్టాండులో మండల కన్వీనరు సారధ్యంలో జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. ఈ సందర్భంగా మండల కన్వీనరు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మండలానికి కోట్లాది రూపాయల నిధులు వచ్చాయని, గత ప్రభుత్వంలో బాగుపడని ప్రతి రోడ్డును ఇప్పుడు బాగు చేస్తున్నామన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంతాల్లో వీధివీధినా డ్రైనేజీలు, ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. టీడీపీ సభ్యత్వం పొందిన వ్యక్తి మరణిస్తే రూ.5లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. అలాగే ఎన్టీఆర్ ట్రస్టు తరుపున మరిన్ని పథకాలు ఆ కుటుంబానికి చెందుతాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకుని భవిష్యత్తులో బాగుపడాలని సంక్షేమ పథకాలు కూడా అందుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మల్లిఖార్జునరెడ్డి , నియోజకవర్గ ఐటీడీపీ ఆది, యువనేత క్రిష్ణకాంత్, నీటి సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, రాంబాబు, ఖదీర్, గౌస్‌పీర్, ఖాజాహుసేన్ పాల్గొన్నారు.

సభ్యత్వంతో భరోసా



సభ్యత్వం నమోదు చేయిస్తున్న సర్పంచ్ సుజాతమ్మ, తదితరులు

సికేదిన్నె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో భరోసా ఉంటుందని కొప్పర్తి సర్పంచ్ కోకటం సుజాత తెలిపారు. ఆదివారం వారి ఆధ్వర్యంలో 500 సభ్యత్వాలు నమోదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారి రక్షణకు, వారి భద్రతకు బీమా కల్పించే విధంగా ఈ సభ్యత్వాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకుని ధీమాగా ఉండాలని తెలిపారు. ఈశ్వర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, అయ్యవార్‌రెడ్డి, ఉత్తరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

145 జీఓను నిలిపేయాలని న్యాయశాఖ మంత్రికి వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

కడప రూరల్, డిసెంబర్ 29 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారులను ఇబ్బందులకు గురిచేసే 145 జీవోను నిలుపుదల చేయాలని న్యాయశాఖ మంత్రి ఫరూక్‌ను కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బొగ్గుల గుర్రప్పనాయుడు కోరారు. కడప పర్యటకు వచ్చిన మంత్రి ఫరూక్‌కు ఆదివారం వారు వినతి పత్రం అందజేశారు. ఈ జీవో కారణంగా కక్షిదారులకు, న్యాయవాదులకు ఇబ్బందులు కలుగుతాయని వివరించారు.

సంక్రాంతికైనా పాత బకాయిలు చెల్లించండి : ఎస్టీయూ



సమావేశంలో మాట్లాడుతున్న ఇలియాస్ బాషా

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకైనా పాత బకాయిలు చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈఎల్స్, ఏపీజీఎల్ఐ, ఫైనల్ పేమెంట్స్, పీఎఫ్ ఫైనల్ పేమెంట్స్, పీఎఫ్ లోన్లు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వీటి చెల్లింపుల కోసం ఉపాధ్యాయ లోకం ఎదురుచూస్తోందన్నారు. సంక్రాంతి పండుగకైనా చె ల్లించాలని కోరారు. అలాగే రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు కె. సురేష్‌బాబు మాట్లాడుతూ చాలా పాఠశాలలో ఉపాధ్యాయ సమస్యలు ఉన్నాయని, త్వరగా పదోన్నతులు చేపట్టి వాటిని భర్తీ చేయాలని కోరారు. జేఎల్ ప్రమోషన్లు కూడా చేపట్టాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంభం బాలగంగిరెడ్డి మాట్లాడుతూ నాన్ టీచింగ్ వారి పట్ల ఉన్న మక్కువ ఉపాధ్యాయుల పట్ల లేకపోవడం బాధాకరమన్నారు. 40శాతం జేఎల్ పదోన్నతులు వెం టనే చేపట్టాలని కోరారు. 12వ పీఆర్సీ ఆలస్యం అవుతున్న కారణంగా 30 శాతం ఫిట్‌మెంట్ వెంటనే ఇవ్వాలని కోరారు. ఎస్టీయూ నాయకులు గాలి సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యంపై అవగాహన కలిగి ఉండాలి

వేంపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవవైవిధ్యం ప్రాముఖ్యత, పరిరక్షణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త అన్నారు. ఆదివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎన్ఎస్ఎస్‌యూ నిట్-9 ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభివృద్ధిపేరుతో చెట్లను కొట్టివేయడం వలన అడవులు క్రమేణా అంతరించి పోతున్నాయని, దీని వల్ల ప్రపంచానికి పెను ముప్పు వాటిల్లనుందన్నారు. సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. పరిపాలన అధికారి రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ఎన్ఎస్ఎస్ అధికారులు తిరుపతిరెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన ఆవు



వేంపల్లె, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణాలలో వీధి ఆవుల వలన రోడ్డు ప్రమాదాలు తరచూ చూస్తూనే ఉన్నాం. చిన్న వాహనాలకు ప్రమాదమైనపుడు వాహనదారులకు..అదే పెద్ద వాహవాహనలకు ప్రమాదం అయినపుడు వీధిలో జరిగే ఆవులకు ప్రాణాపాయం జరుగుతుంది. ఆదివారం ఉదయం కడప నుంచి పులివెందులకు వెళ్లే పల్లెవెలుగు ఆర్టీసీ బస్సు వల్ల ఒక ఆవుకు రోడ్డు ప్రమాదం జరిగింది. అది ప్రాణాపాయస్థితిలో వేంపల్లె అడ్డరోడ్డు సర్కిల్‌లో ఉంది. మధ్యాహ్నం వరకు కదలకుండా పడుకని ఉన్న ఆవును గుర్తించి స్థానికులు గో సంరక్షణ సేవా బాధ్యులు పుల్లగూర గోవర్ధన్‌కు సమాచారం ఇవ్వగా 1962 వాహనంలో ప్రథమ చికిత్స చేసి స్థానిక పశువుల ఆసుపత్రిలో చేర్చారు. ఇలాంటి ఘటనలు జరగకుండా పంచాయతీ అధికారులు వీధి ఆవుల యజమానులకు రోడ్డు మీద ఆవులను వదలకుండా ఇంటి వద్దే పోషించుకునేలా ఆదేశాలు ఇవ్వాలని గో సంరక్షణ సేవా సభ్యులు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 27 కుటుంబాలు చేరిక



టీడీపీలో చేరిన వారితో పేర్ల పార్థసారధిరెడ్డి, మారెడ్డి జోగిరెడ్డి

వేముల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తవారిపల్లెలో టీడీపీ నాయకుడు రంగారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నుంచి 27 కు టుంబాలు టీడీపీలో చేరాయి. టీడీపీలో చేరిన వారికి ఆదివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల సంక్షేమానికి ఎనలేని కృషిచేస్తోందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చంద్రబాబు, లోకేష్‌లు ప్రత్యేక శ్రద్ధ వహించి రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడంలో చేస్తు న్న కృషి అభినందనీయమన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కూటమి ప్రభు త్వం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో గడిచిన ఆరు నెలల్లోనే రాష్ట్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, ప్రజా సంక్షేమం పట్ల చంద్రబాబు నాయుడు చూపుతున్న చొరవను చూసి టీడీపీలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో సంపతి అశోక్‌కుమార్, ఆంజనేయు లు, గంగాధర, రామాంజనేయులు, గంగారా జు, భాస్కర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, గంగిరెడ్డి తదితర కుటుంబాలు చేరాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బ్రహ్మయ్య, శ్రీనాథ్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఓబులేసు, సత్యమారెడ్డి, పెద్దారెడ్డి, గంగాభాస్కర్, బాష, పెద్దజూటూరు బాషా, వెంకటేష్, విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూతన వాటర్ ప్లాంట్ ప్రారంభం

మండలంలోని వేల్పుల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు రాగిపిండి సుధాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన నూతన వాటర్‌ప్లాంట్‌ను టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి, తుంగభద్ర హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మంచి నీటి శుద్ధి కేంద్రాన్ని అందుబాటులోకి తేవడం అభినందనీయమన్నారు.

మార్కెట్ సమస్యకు పరిష్కారం లేదా..?

● పుట్టగొడుగుల్లా కూరగాయల దుకాణాలు ●ఇష్టారాజ్యంగా అధిక ధరలకు విక్రయాలు ● నిరుపయోగంగా కూరగాయల మార్కెట్ భవనాలు





మార్కెట్ భవనం పక్కన ఉన్న దుకాణాలు, జమ్మలమడుగు-తాడిపత్రి రోడ్డులో వెలసిన కూరగాయల దుకాణాలు

జమ్మలమడుగు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు పట్టణంలో కూరగాయల మార్కెట్ సమస్య ఏర్పడింది. పది సంవత్సరాల నుంచి కూరగాయల మార్కెట్ భవనం వ్యాపారులకు, ప్రజలకు అసౌకర్యంగా మారింది. మార్కెట్ భవనం ప్రణాళిక లేకుండా ఇష్టారాజ్యంగా అధికారుల నిర్లక్ష్యంతో అప్పట్లో నిర్మించినట్లు ఆరోపణలున్నాయి. అంతేగాక అప్పట్లోనే కొందరు ఆ భవనం నిర్మించకూడదని వ్యతిరేకించారు.

● నిరుపయోగంగా మారిన కూరగాయల మార్కెట్..: పట్టణంలో కూరగాయల మార్కెట్ వీధిలో పాత భవనాలు తొలగించి సుమారు ఎనిమిది నుంచి 10 సంవత్సరాల క్రితం కొత్త భవనం నిర్మించారు. అప్పటి నుంచి జమ్మలమడుగు నియోజకవర్గ కేంద్రంలో మార్కెట్ సమస్య ఏర్పడింది. ఎత్తులో నిర్మించడం వలన వ్యాపారులు సక్రమంగా వ్యాపారం జరుగదని అసహనం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో కూరగాయల మార్కెట్ సంబంధించిన సమస్యలు పట్టించుకోలేదని విమర్శలున్నాయి. అయితే ఆ భవనం నిరుపయోగంగా మారి అక్కడున్న వ్యాపారులు రోడ్డు పక్కనే ఇరువైపులా కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్‌లో కూరగాయలను కొనుగోలు చేయడానికి ప్రజలు వెళ్లాలన్నా ఆ రోడ్డులో వాహనాలు వెళ్లాలన్నా ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. జమ్మలమడుగు పట్టణంలో అనేకచోట్ల కూరగాయల దుకాణాలు పుట్టగొడుగుల్లా వెలిశాయి. జమ్మలమడుగులో వచ్చిన ప్రతి ఒక్కరూ కూరగాయల మార్కెట్ ఎక్కడ అనేప్రశ్న తలెత్తింది.

● అధిక ధరలకు విక్రయాలు..: జమ్మలమడుగులో కూరగాయల దుకాణాలు ఇష్టారాజ్యంగా వెలిశాయి. మున్సిపాలిటీ అధికారులకు కూరగాయల మార్కెట్ సమస్య పరిష్కరించాలని ఆలోచన లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద నుంచి మెయిన్‌బజార్ వెళ్లే కూరగాయల మార్కెట్ మొదటి నుంచి ఉంది. కరోనా సమయంలో పలుచోట్ల విస్తరించింది. తర్వాత తాడిపత్రి రోడ్డు, పలగాడివీధి, మోరగుడి మూడు రోడ్ల కూడలి, ఆర్టీసీ బస్టాండు, కన్నెలూరు తదితర ప్రాంతాల్లో పెద్ద దుకాణాలు వెలిశాయి. అయితే ధరల నియంత్రణ అదుపు చేసే అధికారులు లేరని విమర్శలున్నాయి. ప్రస్తుతం మున్సిపాలిటీలో గేటు వసూళ్లు ఎక్కువగా చేస్తున్నారని ఆరోపణలు వినపడుతున్నాయి. కూరగాయల మార్కెట్‌లో చిన్నచిన్న దుకాణాలు అధికం కావడంతో మార్కెట్ వీధి బోసిపోయింది. నిరుపయోగంగా మార్కెట్ భవనం మారింది. ఇలాంటి సమస్యలు జమ్మలమడుగులో ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. మార్కెట్‌వీధి, తాడిపత్రి రోడ్డు, తదితర వీధులు ట్రాఫిక్ అంతరాయం ఉన్నప్పటికి చర్యలు లేవని విమర్శలున్నాయి. ఇప్పటికైనా జమ్మలమడుగు డివిజన్ కేంద్రంలో నిరుపయోగంగా మారిన కూరగాయల మార్కెట్ ఉంచడమా లేక ఇతర ప్రాంతంలోకి మార్కెట్ ను మార్చడమా చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. వ్యాపారులతై ఎతైన భవనంలోకి వెళ్లే ప్రసక్తే లేదని, తమకు వ్యాపారం జరుగలేదని, మార్కెట్ ఎదురుగానే రోడ్డుకు ఇరువైపులా ఏర్పాట్లుచేసుకున్నారు. ఈ విషయంపై కమిషనర్ వెంకటరామిరెడ్డిని వివరణ కోరగా కూరగాయల దుకాణాలు పెరిగాయి. ధరల విషయం, దుకాణాలు ఒకే చోటఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



కొండాపురం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కడప-తాడిపత్రి హైవే పై వెంకటాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాల య్యాయి. ముద్దనూరు నుంచి తాడిపత్రి వైపు వెళుతున్న కారు, తాడిపత్రి నుంచి కొండాపురం వైపు వెళుతున్న బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి.ఈ సంఘటనలో బైకులో ప్రయాణిస్తున్న దత్తాపురం గ్రామానికి చెందిన అశోక్, అనంతపురం జిల్లా సూరేపల్లికి చెందిన రాము, ప్రణయ్‌కి గాయాలయ్యాయి. వీరిలో అశోక్‌కు కాలు, చేయి విరిగింది. ప్రణయ్, రాముకు కాలు విరిగి గాయాలయ్యాయి.వీరిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు.

బీజేపీ మండల శాఖ అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి

చాపాడు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలం బీజేపీ నూతన అధ్యక్షుడిగా కేతవరం గ్రామానికి చెందిన లింగందిన్నె గోపాల్‌రెడ్డిని నియమించినట్లు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవాలయం వద్ద ఆదివారం కార్యకర్తల సమావేశం జరిగింది. 25 మంది క్రియాశీలక సభ్యులు గోపాల్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గోపాల్‌రెడ్డికి నాయకులు నియామక పత్రం అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు బీరం సుబ్బారెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, యువ మోర్చ అధ్యక్షుడు బొమ్మన విజయ్, నాయకులు బొగ్గుల చంద్రశేఖర్‌రెడ్డి, ఆరవేటి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలోనైనా కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్య లు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఏపీటీఎఫ్ కేలండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర నాయకులు చంద్రశేకర్‌రెడ్డి, రాజగోపాల్, ఈశ్వర చంద్ర, పద్మజ, డాక్టర్ నాగార్జున పాల్గొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం కేలండర్...

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర కేలండర్‌ను ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు డబ్ల్యూఎన్ ఓబులేసు, రమణయ్య, జిల్లా నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, బాబు, బోగాది సుధాకర్, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

4, 5తేదీలలో సీపీఎం జిల్లా మహా సభలు

బద్వేలు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): జనవరి నెల 4,5 తేదీలలో కడపలో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలు విడుదల చేశారు.

ప్రొద్దుటూరు టౌన్..: సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవరి 4, 5 తేదీల్లో కడపలో సీపీఎం జిల్లా మహాసభలు జరుగుతాయని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు చెన్నారెడ్డి, శేఖర్, బాబు, పక్కీరయ్య పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

పోరుమామిళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : దళిత ఎంపీడీవోపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని అంబేడ్కర్ సేన రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యాల ప్రసాదరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అన్నమయ్యజిల్లా గాలివీడు ఎంపీడీవో జవహర్‌బాబుపై దౌర్జన్యం చేసిన వారిని అరెస్టు చేసి శిక్షించాలన్నారు.

రేషన్ దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ఖాజీపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో 34 రేషన్ దుకాణాలు నిర్వహించేందుకు ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు మహబూబ్‌లత అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలో 36 రేషన్‌షాపులు ఉండగా రెండింటికి మాత్రమే పర్మినెంట్ చౌక దుకాణదారులు ఉన్నారని, మిగతా 34కు ఇంటర్మీడియట్ పాసై స్థానికంగా ఉండడంతోపాటు వయస్సు 40 సంవత్సరాలలోపు ఉన్నవారు జనవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని వారు అన్నారు.

రేపు పింఛన్ల పంపిణీ

మైలవరం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితర పెన్షన్‌దారులకు డిసెంబరు 31న మంగళవారం పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. మండలంలో 6,439 మంది పెన్షన్‌దారులకు రూ.2,68,29,000 నగదును పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉనికిని కాపాడుకునేందుకు వైసీపీ నిరసనలు

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఓటర్లు 11 సీట్లకు పరిమితం చేసిన దెబ్బతో రాష్ట్రంలో కనుమరుగైన వైసీపీ తమ ఉనికిని కాపాడుకునేందుకు ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందంటూ నిరసన కార్యక్రమాలు చేపట్టిందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఐదుసార్లు విద్యుత్ బిల్లులు పెంచి ప్రజల నడ్డివిరిచిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచదలుచుకుంటే ప్రజలకు తెలియపరిచి పారదర్శకంగా నిర్ణయం తీసుకుంటుందన్నారు. వైసీపీ హయాంలో ఇసుక దందాను సాగించి అక్రమంగా వేల కోట్లు ఆర్జించారన్నారు. కానీ టీడీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానంలో సామాన్యునికి ఇసుకను అందుబాటులోకి తెచ్చిందన్నారు.వైసీపీ చేపట్టిన అక్రమాల వల్ల జైలు పాలు కావాల్సివస్తుందన్నారు. టీడీపీ చెప్పిన సూపర్ సిక్స్‌పథకాలు వందశాతం అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే పెన్షన్ పథకంతో పాటు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసిందన్నారు. చెప్పనివికూడా ఇంటర్‌కాలేజీల్లో మధ్యాహ్నబోజనం ,అన్నాక్యాంటీన్‌లను సైతం అమలు చేస్తున్నదన్నారు. వైసీపీ హయాంలో విద్యాదీవెనకు నిధులు ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టర్లకు, హాస్టల్స్‌కు కోట్లరూపాయల బకాయిలు పెట్టిందన్నారు.మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కనీసం నిరసన తెలిపేందుకు కూడా అవకాశం లేకుండా టీడీపీ నాయకులను హౌస్ అరెస్టులు చేసి నిరంకుశంగా వ్యవహరించారన్నారు. కార్యక్రమంలోమాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి, కౌన్సిలరు మురళీధర్‌రెడ్డి, ఖలీల్ , పగిడాల దస్తగిరి, రిటైర్డ్ ఎస్ఐ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు 50శాతం రిజర్వేషన్లకోసం పోరాడాలి



బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నూతన సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కులగణనను చేపట్టి బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడం కోసం 2025 నూతన సంవత్సరంలో సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని బీసీ ప్రజా ప్రజాచైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు బీసీ సమాజానికి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గీతాశ్రమం వీధిలోని బీసీ కార్యాలయంలో 2025 సంత్సరం బీసీ సమాఖ్య క్యాలెండర్‌ను బీసీ నేతలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవేంద్రుడు , కోశాధికారి మడకా సంటెయ్య, ఉపాధ్యక్షులు విజయప్రతాప్, వేల్పుల భాస్కర్, కార్యదర్శులు పోసా ఆదినారాయణ, ఆరికటిక భాస్కర్‌రావు, తుపాకుల చౌడయ్య, పరమేశ్వరరావు, కొమ్మద్ది రాముడు, చంద్రమౌళి, కాటం కిరణ్, బత్తల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన పోటీలు

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ కాలనీలోని టీవీఆర్ హైస్కూలు వద్ద ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి దూరపు పరుగు పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. 16 సంవత్సరాలలోపు బాలురకు నిర్వహించిన 2 కి.మీ. పరుగు పోటీల్లో చంద్ర ఓబుళరెడ్డి, నజీర్, బాలికల విభాగంలో షేక్ ఫాతిమా, నస్రిమ్, 18 సంవత్సరాలలోపు బాలురకు 6 కి.మీ. విభాగంలో మునీనరేంద్ర, తేజస్సు, బాలికల విభాగంలో 4 కి.మీ. విభాగంలో షేక్ ముబీనా, 20 సంవత్సరాలలోపు బాలుర 8 కి.మీ. విభాగంలో దేవేంద్ర, గంగాధర్, పురుషుల 10కి.మీ. విభాగం హేమకిరణ్‌నాయక్, శ్రీహరి ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి అహమర్‌బాష, వ్యాయామ సంచాలకుడు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక లలిత కోటినామ పారాయణం





పూజలు చేస్తున్న మౌనస్వామి, భక్తులకు అన్నదానం చేస్తున్న చల్లా రాజగోపాల్‌యాదవ్

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం సామూహిక లలిత కోటి నామ పారాయణం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం లలితాదేవి ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించి శ్రీ విద్యాపీఠం మౌనస్వామి పూజలు నిర్వహించారు. అనంతరం వెయ్యి మంది భక్తులతో పదిసార్లు సామూహిక లలిత పారాయణం చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పారాయణం కొనసాగింది. భక్తులకు మధ్యాహ్నం టీడీపీ బీసీ నాయకుడు చల్లా రాజగోపాల్‌యాదవ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పట్టణంతోపాటు జమ్మలమడుగు, మైదుకూరు, కమలాపురం, కడప ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలతో మానసిక వికాసం

ప్రొద్దుటూరు , డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు క్రీడా పోటీలలో పాల్గొనడం ద్వారా శారీరక వికాసం తో పాటుమానసిక వికాసం పెంపొందుతుందని ప్రముఖ న్యాయవాది ,మున్సిపల్ టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని శివశంకర కాంప్లెక్స్ లో ఓపెన్ చెస్ టోర్నమెంటు పోటీ లను ప్రొద్దుటూరు చెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టోర్నమెంటు లో ప్రథమ స్థానంలో శ్రీకాంత్, ద్వితీయ స్థానం ప్రభుదేవా, తృతీయ స్థానం నవాజ్‌కు లభించింది. అండర్ 15 ప్లస్ కింద నందన్‌సాయి ,మోహిత్ అండర్ 12 సుజన్‌కుమార్ విజయం సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు చెస్ క్లబ్ నిర్వాహకులు రెడ్డిపవన్, ముజమిల్, హెడ్మాస్టర్ ఇమామ్, టీఎస్టీయూసీ జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ పాల్గొన్నారు.

టీడీపీ కౌన్సిలర్ మట్కా నిర్వహిస్తుంటే మీరేం చేస్తున్నారు.?

ఎమ్మెల్యేని ప్రశ్నించిన మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి

ప్రొద్దుటూరు ,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరులో మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్‌లకు తావులేకుండా పరిపాలన సాగిస్తానని చెప్పిన ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్వయంగా టీడీపీ కౌన్సిలర్ మునీర్ మట్కా నిర్వహిస్తుపట్టుబడ్డాడని దీనికి ఏం సమాధాన మిస్తారని మున్సిపల్ వైస్ చైర్మెన్ పాతకోట బంగారురెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు టీడీపీ కౌన్సిలర్లు గోవాలో క్యాసినోకు ఇక్కడి నుంచి దళారులుగా పనిచేస్తున్నారన్నారు. మీరు మద్యం షాపుల్లో తాపవద్దని ఎక్సైజ్ అధికారులను ఆదేశిస్తే మీకుమారుడు కొండారెడ్డి మాత్ర ం మద్యం షాపుల్లో తాపుకోమని చెబుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా మీ మాటలకు మీకుమారుడి చేతలకు ఏ సంబంధంలేకుండా వుందన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం



పెండ్లిమర్రి నుంచి ఆటోలో వచ్చిన వృద్ధురాలిని పరామర్శిస్తున్న రామక్రిష్ణారెడ్డి

పోరుమామిళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆదరణ కరువై వృద్ధాప్యంలో చూసేవారు, పలకరించేవారు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఓ పాకలో మృత్యువు కోసం ఎదురు చూస్తున్న ఓ వృద్ధురాలి దీనగాథ తెలుసుకున్న వివేకానంద ఆశ్రమ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామక్రిష్టారెడ్డి తమ ఆశ్రమంలో ఆమెకు ఆశ్రయం కల్పించారు. పెండ్లిమర్రి మండలం ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఉన్న పాకలో తలదాచుకున్న ఓ వృద్ధురాలి విషయం ఓ వ్యక్తి ఆమె గురించి తెలపడంతో కాశినాయన మండలంలోని వివేకానంద సేవాశ్రమానికి తీసుకువచ్చారు. దాదాపు 70 సంవత్సరాలు వయసు ఉన్న ఆ వృద్ధురాలికి భర్త ఎప్పుడో కాలం చేశాడు. ఉన్న ఒక్క కూతురుకు పెళ్లి చేసి తన బాధ్యత తీర్చుకుంది. వృద్ధాప్యం, అనారోగ్యం ఆ అవ్వను కుంగదీశాయి. కూతురు కుటుంబ పరిస్థితి ఎలాగుండో తెలియని పరిస్థితి. వారికి ఎందుకు భారంగా ఉండాలని భావించిందో ఏమో తెలియదు కానీ ఆ వృద్ధురాలు పాకలో చేరింది. అయినవారు లేక ఆవాసం లేక అన్నం పెట్టేవారు లేక దీనావస్థలో కాలం వెలిబుచ్చింది. ఆమె దీన పరిస్థితి తెలుసుకున్న వ్యక్తి ఆటోలో తీసుకుని వచ్చి సేవాశ్రమంలో చేర్చారు.

సన్నపురెడ్డి రచనలకు అంతర్జాతీయ ఖ్యాతి



సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న వక్తలు, ప్రముఖులు

పోరుమామిళ్ల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తన రచనలతో ప్రాంతీయం దాటి జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి దక్కించుకున్నారు సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి అని రామ్‌కీ ఫౌండేషన్ కవి, కథకుడు ఎంవీ రామిరెడ్డి, కడప కవితా విద్యాసాంస్కృతిసేవా సంస్థ అధ్యక్షుడు ఆలపర్తి పిచ్చయ్యచౌదరి, డాక్టర్ సింగిరెడ్డి గంగాదేవి, కె.నాగార్జున, సాయి ప్రతాప్,చింతకుంట ప్రసాదరెడ్డి, మోపూరి లలితకుమారి తదితర వక్తలు పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరెడ్డి అధ్యక్షతన సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి సాహిత్య సమాలోచనం సందర్భంగా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన రచించిన నవలలు కాడి, పాండవబీడు, చినుకులసవ్వడి, పాలగత్తె, కొత్త దుప్పటి, బతుకుసేద్యం, ఒక్క వాన చాలు, మబ్బులు వాలని నేల, ఒంటరి, బడి, కొండపొలం వంటి ఎన్నో నవలలు రచించి ప్రముఖుల మన్నన లు పొందడమే కాకుండా జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మన ప్రాంతానికి గర్వకారణ మన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు.

పడకేసిన పారిశుధ్యం

మైదుకూరు రూరల్,డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యి సుమారు 13 సంవత్సరాలు అవుతున్నా పారిశుధ్యం విషయంలో అధికారులు దువుతున్నారని ప్రజలు వాపోతున్నారు.మైదుకూరు మున్సిపాలిటీలో చాలా వీధుల్లో చెత్త, చెదారాలు తీయక పోవడంతో వీధులన్నీ కంపు కొడుతున్నాయి.పాత సాయిబాబా ఆలయం,వేదవ్యాస స్కూల్, బద్వేల్ రోడ్డు మసీదు,బద్వేల్ రోడ్డు సచివాలయం వద్ద ఇలా పలు చోట్ల చెత్త కుండీల వద్ద సరిగ్గా శుభ్రం చేయకపోవడంతో రోడ్డు మీద వెళుతున్న ప్రజలు ముక్కున వేలేసుకొని వెళ్లాసిందే అంతేకాకుండా మైదుకూరు పట్టణంలో పందులు,కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలుమార్లు అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.వృద్ధులు,పిల్లలు వీధుల్లో నడవాలంటేనే బయపడుతున్నామని చెబుతున్నారు. నంద్యాల రోడ్డు సూపర్ మార్కెట్ ఎదురుగా ఉన్న వీధిలో మురుగు కాలువలు లేక పోవడంతో ఎప్పుడు బురదనీటితో నిండి ఉంటుందని, అక్కడ దోమలు విపరీతంగా వ్యాప్తి చెంది విషజ్వరాలు వచ్చే ప్రమాదముందని స్థానికులు చెబుతున్నారు.



చెత్త కుండీల వద్ద పందుల స్వైర విహారం